క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జులైవాడ, రోహిణి ఆస్పత్రి, సుబేదారి మెయిన్ రోడ్డు, శ్రీకృష్ణ ఆస్పత్రి ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సెప్టెంబర్ 27న 'చలో ఢిల్లీ'

నయీంనగర్: కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని సెప్టెంబర్ 27న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎస్‌బీఎం అధ్యక్షుడు కె.అనిల్ కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేయనున్న దీక్షకు పలు కుల సంఘాలు, అనుబంధ సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, అనిల్, ఉదయ్‌కుమార్, సాంబయ్య, కరుణ, సంపత్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి రూ.35 వేల ఫీజు చెల్లింపు



విద్యారణ్యపురి: హైదరాబాద్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థిని కోమళ్ల భవ్యశ్రీకి కళాశాల ఫీజు నిమిత్తం విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్, సీడబ్ల్యూసీ చైర్మన్ అన్నమనేని అనిల్‌చందర్, సూరం కరుణాకర్‌రెడ్డి, మోత్కూరి రాకేష్ రూ.35 వేల విలువగల చెక్కును హనుమకొండలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో సోమవారం అందించారు. కార్యక్రమంలో కలకొట్ల నరేందర్, ఒద్దిరాజు ప్రకాశ్, శృతి, వసంత, అనిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి: ఇటీవల మరణించిన గోపాలపురం కృష్ణకాలనీకి చెందిన బొమ్మ వెంకటయ్య గౌడ్ కుటుంబాన్ని సర్వాయి పాపన్న గౌడ్ సంఘం నాయకులు సోమవారం పరామర్శించారు. ఈమేరకు బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ సంఘం అధ్యక్షుడు కూనూరు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ నిరుపేద గౌడ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వల్లాల రాజుగౌడ్, పంజాల ఓదెలు, మహేందర్, అనిల్, కిశోర్, కర్ణాకర్, గొల్లపల్లి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

దోషులకు ఉరిశిక్ష విధించాలి

హన్మకొండ చౌరస్తా: కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన దోషులకు ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో బాలికలు, యువతులు, మహిళలకు రక్షణ కరువైందని వాపోయారు. వేదిక జిల్లా కన్వీనర్ నయీమొద్దీన్ ఆధ్వర్యంలో అలంకార్ నుంచి హనుమకొండ చౌరస్తా వరకు సాగిన ర్యాలీలో డాక్టర్లు అనీస్ సిద్దిఖీ, రాజ్‌మహ్మద్, వేదిక బాధ్యులు మోసిన్, రషీద్, మెహ్రాజ్, అజీమ్, ఇమ్రాన్, అమ్జద్‌మీర్జా, గౌస్‌పాషా పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ

రామన్నపేట: ఆటోలో ఓ మహిళా మరిచిపోయిన బ్యాగును పోలీసులకు అప్పగించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. కాశిబుగ్గకు చెందిన ఆటో డ్రైవర్ కదిరాల కిరణ్ తన ఆటోలో సోమవారం ఉదయం కాశిబుగ్గ శివాలయం నుంచి ఒక మహిళను ఆమె కుటుంబ సభ్యులను ఎక్కించుకొని హనుమకొండ పెట్రోల్ పంపు దగ్గర దింపాడు. ఆటో దిగే సమయంలో సదరు మహిళా తన బ్యాగును అందులోనే మర్చిపోయిన విషయాన్ని కొంతసేపటికి గమనించిన ఆటో డ్రైవర్ కిరణ్.. వెంటనే ఆ బ్యాగును ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగులో సుమారు 2తులాల బంగారు ఆభరణాలు, రూ.17,500 నగదు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, సదరు మహిళ ఇంకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని, బాధితురాలిని గుర్తించి అప్పగిస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

హసన్‌పర్తి: వివిధ ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, వాటిని విక్రయించడానికి తీసుకెళ్తున్న ఓ ముఠా పోలీసులకు చిక్కింది. వారి వద్ద నుంచి ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. నిందితులు హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన దండుగుల సాయిలు, దండుగుల కొమురమ్మ, ఆటో డ్రైవర్ పోలు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ వివరించారు.

మల్లికాంబ చిన్నారులతో వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య



స్పందన ఆశ్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి



హనుమకొండ భవానీనగర్‌లోని సన్‌షైన్ స్కూల్‌లో..



అలరించిన ఆబాలగోపాలం

శ్రీకృష్ణుడి జన్మాష్టమి సందర్భంగా నగర వ్యాప్తంగా సోమవారం ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. ఈ మేరకు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టి సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్





హనుమకొండ టీఎన్‌జీవోస్ కాలనీలో చిన్నారులు



వరంగల్ గోమతి పబ్లిక్ స్కూల్‌లో..



బీఆర్ఎస్ హనుమకొండ కార్యాలయంలో..



ఉట్టి కొడుతున్న ఎస్ప్ఆర్ విద్యార్థిని



న్యూశాయంపేటలో సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు



సోమిడిలో రాధాకృష్ణుల దేవాలయంలో..



గోపాలపూర్‌లో..



2వ డివిజన్‌లో..





గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



కరీమాబాద్ స్కూకాటెల్యాన్ హైస్కూల్‌లో..



ఎర్రగట్టు గుట్ట వద్ద కృష్ణాష్టమి వేడుకలు

మదర్ థెరిస్సాకు ఘన నివాళి



కాజీపేట: సామాజిక సేవకురాలు మదర్ థెరిస్సా 114వ జయంతి వేడుకలను ఫాతిమానగర్‌లో క్రైస్తవులు సోమవారం జరుపుకున్నారు. కెథడ్రల్ చర్చి ఆవరణలో కథోలికులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఫాతిమానగర్ - కేయూ 100 ఫీట్ రోడ్డులో మదర్‌థెరిస్సా విగ్రహానికి కెథడ్రల్ చర్చి విచారణ గురువు ఫాదర్ కాసు మర్రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహం ఎదుట క్రైస్తవ భక్తులు కొవ్వొత్తులు వెలిగించి మదర్‌థెరిస్సా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చర్చి విచారణ కమిటీ సభ్యులు ఆర్.రాజ్‌మోహన్ రావు, మత్యాస్‌రెడ్డి, బైరపాక ప్రభాకర్, భిక్షపతితో పాటు సిస్టర్లు, ఫాదర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో..



హసన్‌పర్తి: నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా జయంతి వేడుకలను నగరంలోని ముచ్చర్లలో సోమవారం నిర్వహించారు. ఈమేరకు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మదర్ థెరిస్సా సామాజిక సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, రాజేష్, రమేష్, కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలకు ఆర్ఓఆర్ వర్తింపజేయాలి



మాట్లాడుతున్న కలకోటి మహేందర్

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న ఆర్ఓఆర్ -2024 చట్టాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 32విలీన గ్రామాలకు వర్తింపజేయాలని న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అసైన్డ్ భూమి సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాదాబైనామాల ద్వారా భూమి కొనుగోలు చేసిన రైతులకు అవకాశం కల్పించి, పట్టాదారు పాస్‌బుక్కులు జారీ చేయాలన్నారు. పట్టా, అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములను కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా క్రమబద్ధీకరించడానికి అవకాశం కల్పించాలని సూచించారు. కొత్త చట్టం అమలు కోసం ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభిప్రాయాలను తీసుకోవాలని, అందుకు రెండు నెలల గడువు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, రైతు సంఘం నాయకుడు నేరెళ్ల బస్వరెడ్డి, ఏబీఎస్ నాయకులు పోలెపాక మల్లేశం, మోరే ఐలయ్య, కొలిపాక రమేష్, మంద ప్రశాంత్ పాల్గొన్నారు.

కోదండరామ్‌కు విద్యాశాఖ మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న కలకోటి మహేందర్

కేయూ క్యాంపస్: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవి కేటాయించాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (కుర్తా) కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో సోమవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన కోదండరామ్‌కు ఎమ్మెల్సీగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కోదండరామ్‌కు విద్యాశాఖమంత్రి పదవి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని, ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కుర్తా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, కోశాధికారి ప్రొఫెసర్ వీరన్న, జాయింట్ సెక్రటరీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ సుధాకర్, ప్రొఫెసర్ సమ్మయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

కాశిబుగ్గ: శ్రావణమాసం నాల్గో సోమవారాన్ని పురస్కరించుకుని కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 9 కిలోల తేనెతో ఆలయంలోని సహస్ర లింగానికి భక్తులు అభిషేకం చేశారు. మధ్యాహ్నం 75 కిలోల అన్నంతో అన్నపూజ నిర్వహించి భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు.

బొమ్మల గుడిలో రుద్రాభిషేకం

ఖిలా వరంగల్: శ్రావణమాసం సోమవారాన్ని పురస్కరించుకుని కరీమాబాద్‌లో కాశీ విశ్వేశ్వరస్వామి బొమ్మల గుడిలో రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాపర్తి శంకర్‌శర్మ, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వాగిలిశెట్టి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడికి మహాన్యాస రుద్రాభిషేకం చేశారు. రుద్రేశ్వరుడిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కొండూరు శివప్రసాద్, నాగపూరి అశోక్, పుప్పాల సంజీవ్, ఆలయ క్లర్క్ సరిత, సేవకుడు శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఓసిటీ స్టేడియంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు

కాశిబుగ్గ: జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఓ సిటీ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి ఆహ్వానిత క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి (డీవైఎస్ఓ) సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కబడ్డీ, రెజ్లింగ్, జూడో, క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా 29న నగరంలోని వెంకట్రామ జంక్షన్ నుంచి ఓ సిటీ స్టేడియం వరకు క్రీడా ర్యాలీ నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

ఫలితాలు విడుదల చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయాలని పీడీఎస్‌యూ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ కేయూ కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ పీజీ వివిధ ఉన్నత విద్యకోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. ఫలితాలు త్వరగా రాకపోవటంతో పీజీ తదితర ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రవేశాలు పొందలేని దుస్థితి నెలకొందని తెలిపారు.

బ్రిడ్జిపై గుంతలకు మరమ్మతులు



సాక్షి స్పందన

కాజీపేట అర్బన్: సాక్షి దినపత్రికలో ఈనెల 18వ తేదీన ప్రచురితమైన బ్రిడ్జి ఎక్కితే వణుకు అనే కథనానికి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. ఈమేరకు కడిపికొండ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలకు సోమవారం మరమ్మతులు చేపట్టారు. బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి బయటకు వచ్చిన ఇనుప చువ్వలను సరిచేసి మరమ్మతులు చేశారు.

బాంసెఫ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న చెన్నయ్య, నాయకులు

హన్మకొండ: సెప్టెంబరు 1న నిర్వహించనున్న బాంసెఫ్ 11వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బట్టి చెన్నయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బాంసెఫ్ 11వ రాష్ట్ర మహాసభ పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 1న సంగారెడ్డి అంబేడ్కర్ భవన్‌లో బాంసెఫ్ తెలంగాణ రాష్ట్ర 11వ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సభను ప్రారంభించగా, ముఖ్యఅతిథిగా బాంసెఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డీఆర్.ఓహోల్ పాల్గొంటారని వివరించారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ కుమార్, ఉపాధ్యక్షుడు రాజేందర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, ఆయా సంఘాల నాయకులు మధుపాక ఎల్లయ్య, సంతోష్, మచ్చ దేవేందర్, బొట్ర సంపూర్ణ, మేకల అనిత, బౌతు రాధ పాల్గొన్నారు.

వాతావరణ మార్పుతో వ్యాధుల వ్యాప్తి

దేశాయిపేట: వాతావరణ మార్పుల వల్ల అంటు వ్యాధులు వ్యాపిస్తున్నాయని వరంగల్ వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. నగరంలోని మూడో డివిజన్ పైడిపల్లిలో డెంగీ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. వ్యాధులను అరికట్టడానికి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలతో ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. సంబంధిత శాఖల సమన్వయంతో పరిసరాలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించి తగు వైద్య పరీక్షలు చేసుకుని చికిత్స పొందాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌సింగ్, డిప్యూటీ డెమో అధికారి అనిల్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు 'ఎగ్ కార్ట్స్'



ఎగ్ కార్ట్స్ అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పనకు జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం (ఎన్ఈసీసీ) కృషి చేస్తోందని ఎన్ఈసీసీ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. ఓసిటీలోని తన నివాసంలో 50 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు ఎగ్ కార్ట్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్ట్ ఎగ్ కార్ట్స్ ద్వారా యువత ఉపాధి పొంది ఇతరులకు మార్గదర్శకం కావాలని సూచించారు. ఎన్ఈసీసీ సీఓఓ డాక్టర్ అన్నామలై ఏజిల్‌కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారమైన గుడ్లను తింటూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీపీఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షులు రామారావు, నెక్ జోనల్ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరెడ్డి, డబ్ల్యూపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రావు పాల్గొన్నారు.

శివశక్తి వినాయక ప్రతిష్ఠాపన పూజలు



కలశ, గణపతి పూజలు చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు బంక్ జంక్షన్‌లోని శివశక్తి వినాయక మందిరంలో 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న గణపతి, శివలింగం, నందీశ్వర సహిత పార్వతిదేవి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు బైరబోయిన దామోదర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్, మంతిని చక్రధరి, గండి నాగరాజు, గంద్రాతి నవీన్, సిద్దం రాము, అచ్చ వినోద్ కుమార్, గజ్జెల శ్యామ్, సారంగపాణి ఆధ్వర్యంలో వేద పండితుడు పోలోజు భాస్కరాచార్యుల నేతృత్వంలో గణపతి పూజ, యాగశాల ప్రవేశం, హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం సర్వదేవతా అవాహన మూలమంత్రాన్ని యాగ మండపంలో విగ్రహాలకు జలాధివాసం చేపట్టారు. కార్యక్రమంలో బైరబోయిన ఉమ, పోశాల పద్మ, బాసాని శ్రీనివాస్, వడ్డెపల్లి భరత్, రాజన్ బాబు, తాళ్లపెల్లి రమేష్, రాంమోహన్ రావు, రవికుమార్, వాసం సదానందం, రమేష్, బజ్జూరి శ్రీను, కొత్తపెల్లి శ్రీనివాస్, చేరాలు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోవాలి



మడికొండ: రౌడీ షీటర్లు తమ పద్ధతి మార్చుకొని సక్రమంగా నడుచుకోవాలని మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్ హెచ్చరించారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు సహకరించాలని, ఎలాంటి తగాదాల్లో తలదూర్చవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు బీమా అమలుచేయాలి

హన్మకొండ చౌరస్తా: గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం, బీమా పథకాలను అమలు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఉపాధిహామీ కూలీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భూమిలేని రైతులు, కూలీలకు రైతు బీమా పథకాన్ని అమలు చేస్తామని పేర్కొందని, ఇచ్చిన మాట ప్రకారం హామీని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ బాధ్యులు రమేష్, శ్రీనివాస్, రాజేందర్, సంపూర్ణ, అనిత, రాధ, చెన్నయ్య, దేవేందర్, రాజు, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

విద్యారణ్యపురి: ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో తొమ్మిదవ తరగతి నుంచి పీజీ విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాష ఆవశ్యకత అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యా సంస్థ నుంచి ఇద్దరు విద్యార్థులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీలను హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఈనెల 29న ఉదయం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ వేడుకలు

మడికొండ: విశ్వహిందూ పరిషత్ 60వ ఆవిర్భావ వేడుకలు మడికొండలోని శివకేశవ ఆలయంలో సోమవారం జరుపుకున్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆత్మీయ హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహానగర్ అధ్యక్షుడు జయపాల్‌రెడ్డి, కాజీపేట విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు జన్ను రామానుజం, కార్యకర్తలు వినయ్, దువ్వ వేణు, బండ రాజు, వినయ్, లక్ష్మణ్, సాయిరామ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరుడికి పంచలోహ కవచం వితరణ

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలోని ఓంకారేశ్వర స్వామికి 5 కిలోల పంచలోహ కవచాన్ని రాయపురి గణేష్, రేణుక దంపతులు సోమవారం అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కవచానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీకాంతాచారి, కమిటీ సభ్యులు కూచన ఏకాంబ్రం, కూచన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లైమ్‌ల ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి



హసన్‌పర్తి: లేబర్ క్లైమ్‌ల నిర్వహణ బాధ్యతను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో 56వ డివిజన్ వడ్డెపల్లి చర్చి సమీపంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు లేబర్ సంక్షేమ బోర్డ్ ద్వారా వివాహ, డెలివరీ, సహజ మరణం, ప్రమాద బీమా పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. అయితే, ఈ బాధ్యతల నుంచి తప్పుకుని ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడానికి ప్రభుత్వం యోచిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)

వరంగల్: వరంగల్ కొత్తవాడ మాజీ కార్పొరేటర్, కుడా మాజీ డైరెక్టర్ యెలుగం శ్రీనివాస్ (55) మృతి చెందారు. ఆయన మృతిపై బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

నిందితులపై కేసు నమోదు

ఖిలా వరంగల్: భూమి చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న క్రమంలో బెదిరించి అడ్డుకున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. అలాగే, ఓ మహిళను బైక్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. బాధితురాలు పోలెపాక హేమలత ఫిర్యాదు మేరకు దూలం శ్రీపాల్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.